
క్లుప్తంగా

ఘనంగా ఐసీఎం చర్చి వార్షికోత్సవం


ఉపన్యసిస్తున్న బిషప్ జాన్ ఎస్‌డీ రాజు

ఏలూరు (ఆర్‌ఆర్ పేట): ఇండియా క్రిస్టియన్ మిషన్ (ఐసీఎం) చర్చి 127వ వార్షికోత్సవం, జనరల్ కన్వెన్షన్, కోత పండుగ కార్యక్రమం శుక్రవారం స్థానిక ఏఎస్‌ఆర్ స్టేడియం వద్ద ఉన్న ఐసీఎం చర్చ్‌లో బిషప్ జాన్ ఎస్‌డీ రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏలూరు ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు బిషప్ జాన్ సంఘ పతాకావిష్కరణ చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఎలీకే మృత్యుంజయ ఉదయం, సాయంకాలం వర్తమానం అందించారు. కృష్ణా–గోదావరి అధ్యక్ష పీఠం తరపున కార్యదర్శి ఎస్‌వైవీ ప్రసాద్ వార్షిక నివేదిక అందిస్తూ ఐసీఎం సంఘాల అభివృద్ధి, పాఠశాలలు తదితర సంఘ సేవలను వివరించారు. పశ్చిమ బెంగాల్ పీఠం తరపున బిషప్ ఆగస్టీన్ సుకుమార్ వార్షిక నివేదికలో నూతన ఇంగ్లిష్ మీడియం పాఠశాలలను ప్రస్తావించారు. పంజాబ్ పీఠం తరపున వికార్ జనరల్ శ్యామ్సన్ వార్షిక నివేదికలో నూతన దేవాలయాల నిర్మాణ కార్యక్రమాన్ని నివేదించారు. ఉత్తరాఖండ్, తెలంగాణ, త్రిపుర, శ్రీలంక, అమెరికా, కెనడా, ఫ్రాన్స్ పీఠాల తరుపున మెయిల్ ద్వారా వార్షిక నివేదిక పంపారు. బిషప్ జాన్ వార్షికోత్సవ ఉపన్యాసం చేశారు. భోగోలు సంఘ యువత క్వయర్ నిర్వహించారు. మాదేపల్లి డీనరీ చైర్మన్ డి.యోబు, కథెడ్రల్ సంఘ పెద్దలు జీఎస్‌డీ సువర్ణ రాజు, ఎన్.జాన్ లియో, టి .ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఏలూరు (అర్‌ఆర్‌పేట): ఆధార్ కార్డుల్లోని తప్పిదాలను సరి చేయించుకునేందుకు విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆధార్ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, దీనివల్ల విద్యార్థుల ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ ఎక్కౌంట్ రిజిస్ట్రీ (అపార్) చేయించుకోవడానికి ఆలస్యమౌతోందని అందువల్ల పాఠశాల స్థాయిలో తాత్కాలిక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు ఒక ప్రకటనలో కోరారు. వన్ నేషన్, వన్ ఐడీకి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిన నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అపార్ నంబర్ జనరేట్ చేయడం ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు. ఆధార్ కేంద్రాలు స్థానికంగా ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు సమయం కలిసిరావడంతో పాటు రోజుల తరబడి పాఠశాలలకు గైర్హాజరవ్వాల్సిన పని ఉండదని వివరించారు. దీంతో పాటు ఆధార్ కార్డులోని వివరాలు మార్చవలసిన సందర్భంలో పాఠశాల రికార్డుల నుంచి తగిన ఆధారాలు, వాటికి సంబంధించిన ప్రధానోపాధ్యాయుని ధ్రువపత్రాలు వెంటనే ఇచ్చే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ

- వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిందే
- అవగాహన కల్పిస్తున్న ఏలూరు పోలీసులు


ఏలూరు జాతీయ రహదారిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ కేపీ శివ కిషోర్ (ఫైల్)


హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తూ హెల్మెట్ పెట్టుకుని డ్రైవ్ చేస్తున్న ఎస్పీ శివ కిషోర్ (ఫైల్)

ఏలూరు టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణపై జిల్లా పోలీస్ ప్రత్యేక దృష్టి సారించారు. రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా మోటారు సైకిల్‌పై ప్రయాణించేవారే కావటం గమనార్హం. నిత్యం జిల్లా వ్యాప్తంగా ఏదో ఒక ప్రాంతంలో మోటారు సైకిల్‌పై ప్రయాణించేవారు ప్రమాదానికి గురవుతూనే ఉన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణ నష్టం పెరుగుతూ ఉండడం ఆందోళన కలిగించే అంశంగా ఉంది. రోడ్డు ప్రమాదాల్లో విలువైన ప్రాణాలు కోల్పోవటం, ఆయా కుటుంబాల జీవన పరిస్థితులపై తీవ్ర ప్రభావాన్నే చూపుతున్నాయని జాతీయ స్థాయి సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాయి.

హెల్మెట్‌తో ప్రయోజనాలెన్నో

రోడ్డు ప్రమాదాలను గమనిస్తే మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తులు ప్రాణాలు కోల్పోవటం బాధిస్తుంది. ముఖ్యంగా యువత మోటారు సైకిల్ ప్రమాదాల్లో చనిపోవటం తీవ్రమైన అంశంగా పరిగణిస్తున్నారు. ఇక రోడ్డు ప్రమాదాల్లో 80 శాతం మంది తలకు తీవ్రమైన గాయాలు కావటంతో మృత్యువాతపడుతున్నారని తెలుస్తోంది. ప్రమాదాల్లో క్షతగాత్రులను సకాలంలో హాస్పిటల్స్‌కు తరలిస్తున్నా తలకు తీవ్రమైన గాయం కావటంతో చికిత్స అందించినా కోమాలోకి వెళ్ళటమో? కొద్దిరోజులకు చనిపోవటమో జరుగుతుంది. ఈ మరణాలకు అడ్డుకట్ట వేయాలంటే కేవలం హెల్మెట్ ధరించటం ఒక్కటే పరిష్కారంగా భావిస్తున్నారు.

పోలీసుల ప్రత్యేక చర్యలు

ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లాలోని జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై బ్లాక్‌స్పాట్స్ గుర్తించి, వాహనదారులను అప్రమత్తం చేస్తూ బోర్డులు ఏర్పాటు చేయటం, వేగాన్ని నియంత్రించేలా బారికేడ్లు, సైన్‌బోర్డులు పెడుతున్నారు. ముఖ్యంగా ఆయా ప్రాంతాలకు ప్రయాణించే వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ముందుగా వాహనదారులకు అవగాహన కల్పించటం, స్కూళ్లు, కాలేజీల్లో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. తొలుత స్వల్పంగా జరిమానాలు విధిస్తూ హెల్మెట్ ధరించాలని చెబుతున్నారు. అనంతరం కఠినమైన చర్యలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

హెల్మెట్ ధరించాలి



ఏలూరు నగరంలో వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి. ఇప్పటికే రెండు నెలల నుంచి ప్రజలకు హెల్మెట్ ధరించటంపై అవగాహన కల్పిస్తున్నాం. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం. తల్లిదండ్రులు మీ పిల్లలకు మోటారు సైకిళ్ళను కొనుగోలు చేయటంతోపాటు హెల్మెట్ కూడా ఇవ్వాలని, అధిక వేగంగా వాహనాలు నడపకుండా జాగ్రత్తలు చెప్పాలని వారికీ చెబుతున్నాం.

– డి. శ్రావణ్ కుమార్, ఏలూరు డీఎస్పీ

యువత ప్రాణాలు విలువైనవి



దేశానికి యువశక్తి ఎంతో ముఖ్యం. యువత తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలి. రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే అత్యధిక సంఘటనల్లో తలకు తీవ్ర గాయాలు కారణంగానే మృత్యువాత పడుతున్నారని, ముఖ్యంగా యువత చనిపోతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. హెల్మెట్ ధరించడంతో ప్రాణాపాయం నుంచి రక్షణ లభిస్తుంది. తాను మరణిస్తే కుటుంబ సభ్యుల పరిస్థితి గురించి వాహన చోదకులు ఆలోచించాలి.

– ఎస్.లక్ష్మణరావు, ఏలూరు ట్రాఫిక్ సీఐ

కార్తీక పూజలు ప్రారంభం


ప్రత్యేకాలంకరణలో విశ్వేశ్వర స్వామి

ఏలూరు (ఆర్‌ఆర్ పేట): నగరంలోని వివిధ శైవ క్షేత్రాల్లో కార్తీక మాసోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారు జాము నుంచే మహిళలు శైవక్షేత్రాలకు విచ్చేసి ఆలయ ధ్వజ స్తంభాల వద్ద కార్తీక దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో స్వామి వార్లకు ప్రదోషకాల అభిషేకాలు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. సాయంకాలం వేళ ఆకాశ దీప పూజలు, విశేష హారతి సేవలు, నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి విశేష హారతి సేవలు నిర్వహించారు. స్థానిక పవర్ పేట శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానం, పత్తేబాదలో శ్రీ చాడేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం, దక్షిణపు వీధిలో శ్రీ జలాపహరేశ్వర స్వామి దేవస్థానం, అగ్రహారంలోని శ్రీ నగరేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ అన్నపూర్ణ సమేత ప్రతాప విశ్వేశ్వర స్వామి దేవస్థానం, ఆదివారపు పేట శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం, శ్రీ పర్వత వర్ధని సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానం, దొండపాడు దత్తనాథ క్షేత్రంలోని సర్వదోష పరిహారక విశ్వేశ్వర స్వామి దేవస్థానాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాలుర వసతి గృహం పరిశీలన


బాలుర వసతి గృహంలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్) : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్ ఏలూరు శనివారపు పేటలోని బాలుర వసతి గృహాన్ని శనివారం సందర్శించి, వసతి గృహాల పరిశుభ్రత, నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవిద్యార్థులకు అందించే ఆహార నాణ్యతలో రాజీ పడవద్దని, బాల్యంలో మంచి పోషక ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత వ్యవస్థలపై ఉందని సూచించారు. అలాగే విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలను ప్రోత్సహించి వారి మానసిక ఆరోగ్య పరిరక్షణకు మానసిక వికాసాన్ని పెంపొందించేలాగా చూడాలని ఆదేశించారు.

డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

డిసెంబర్ 14వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీయోగ్యమైన అన్ని సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు.

అవినీతిరహిత సమాజాన్ని నిర్మిద్దాం


ఏలూరు(ఆర్‌ఆర్ పేట) : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ సుబ్బరాజు


ఏలూరు రూరల్ : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అవినీతి దేశ అభివృద్ధికి ఆటంకమని, అవినీతి రహిత సమాజాన్ని నిర్మించడం ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించాలని ఏలూరు ఏసీబీ డీఎస్పీ వి.సుబ్బరాజు పిలుపునిచ్చారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాల ఆడియో విజువల్ హాలులో అవినీతి రహిత సమాజ నిర్మాణంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి లేని సమాజాన్ని నిర్మించి దేశ ప్రగతిలో విద్యారుథలు కీలకపాత్ర, భాగస్వామ్యం వహించాలని సూచించారు. ఈ సందర్భంగా అవినీతి నిరోధక శాఖ విధులను విద్యార్థుకు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్ మాట్లాడుతూ అవినీతిలేని సమాజాన్ని నిర్మించాలంటే మనలో ప్రతి ఒక్కరూ అవినీతికి పాల్పడకుండా ఉండాలన్నారు. ఈ అవగాహన సదస్సుకు కళాశాల ప్రిన్స్‌పాల్ కేపీ రామరాజు అధ్యక్షత వహించగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అఫీసర్స్ ఎండీ మహబూబ్ భాషా, బి. శంకర్, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎ. ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో అవినీతి నిర్మూలన

ఏలూరు రూరల్ : అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పని చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎస్‌వైకే అధికారి దూలం కిషోర్ అన్నారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న నిఘా వారోత్సవాల్లో భాగంగా శనివారం ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్చర్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ ఫర్ నేషన్. ప్రొస్పరిటీ నినాదంతో సమాజంలో అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేస్తున్నామన్నారు.. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది డాక్టర్ విజయకుమార్, కృష్ణచైతన్య, డాక్టర్ కావ్యశ్రీ తదితరులతో కలిసి విద్యార్థులు అవినీతి నిర్మూలిస్తామంటూ ప్రతిజ్ఞ చేసారు.

రూ.25 లక్షలతో రోడ్ల మరమ్మతులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని రోడ్ల మరమ్మతులకు రూ.25లక్షలు కేటాయించినట్లు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) తెలిపారు. స్థానిక 7వ డివిజన్‌లోని సత్యనారాయణ థియేటర్,విజయలక్ష్మి థియేటర్ మధ్య రోడ్డులో మరమ్మతులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరు నగరంలోని 50 డివిజన్ల పరిధిలో సుమారు 600కు పైగా గుంతల రోడ్లు ఉన్నట్లు గుర్తించి వాటి మరమ్మతులకు రూ.25 లక్షలు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, కో–ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, చోడే వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలను గురించి రోడ్డు యాక్సిడెంట్లు నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ట్రాఫిక్ పోలీసులు శనివారం అవగాహన కల్పించారు. ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో వీడియో రూపంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనల గురించి విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రహదారిపై నడిచే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటే ఎటువంటి ప్రమాదాలకు గురి కాకుండా గమ్యస్థానాలకు చేరుకుంటారన్నారు. హెల్మెట్ ఉపయోగం గురించి మీ కుటుంబ సభ్యులకు చిన్నపిల్లలు అయినా మీరే జాగ్రత్తలు తెలియజేస్తే ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు టౌన్ : ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన ఒక యువకుడు చెడు వ్యసనాలకు బానిసై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు ఆముదాల అప్పలస్వామి కాలనీ నెహ్రూనగర్ చెందిన కొయ్యా నాగరాజు (33) తాపీపనులు చేస్తూ తన కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తున్నాడు. కొంతకాలంగా నాగరాజు మద్యానికి బానిసగా మారాడు. పనికి వెళ్లకుండా చెడు వ్యసనాలకు అలవాటుపడి మద్యం అధికంగా తాగుతూ ఉన్నాడు. ఈ నేపథ్యంలో అతను జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి వేళ తన గదిలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఏలూరు రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డిగ్రీ, పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలి

దెందులూరు: విద్యా సంవత్సరం చివరి దశకి వస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టభద్రులకు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు నేటికీ ఇవ్వకపోవడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ ఎం సూర్యనారాయణ అన్నారు. శనివారం కొవ్వలిలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతోమంది పట్టభద్రులకు స్కాలర్‌షిప్‌లు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. ఏలూరు జిల్లా ధర్మాజీగూడెంలో స్కాలర్‌షిప్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. పట్టభద్రులు పోస్ట్ గ్రాడ్యుయేట్లు రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని సూర్యనారాయణ కోరారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	28

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	01
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	00
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	02
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	20
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	03
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.40	98517	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.40	98501	29
ఏలూరు - తిరుపతి	16.00	4830	03

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	36	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	96
వంకాయలు (కాంతులు)	72	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	50-506	ములక్కాడలు	07,10
బెండకాయలు	30	కంద	68
పచ్చిమిర్చి	44-48	బీట్‌రూట్	52
కాకర కాయలు	36-44	కీరా దోస	36
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	140
బీరకాయలు (పందిరి)	36	అల్లం	80
క్యాబేజీ	36	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	50-60	పాలకూర	15
దొండకాయలు	30	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	15
ఉల్లిపాయలు	40,50,55	గోంగూర	07
గోరుచిక్కుడు	52	పుదీనా	05
దోసకాయలు	30-48	బఠాణీ	--
ఆనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	92
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	36

రైతులకు నష్ట పరిహారం జమ

ఏలూరు రూరల్: ఇటీవల వచ్చిన వరదల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించిందని మండల వ్యవసాయ అధికారిణి జీవన సంధ్య చెప్పారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఏలూరు రూరల్ మండలంలో జాలిపూడి పరిసర గ్రామాల్లో 70 ఎకరాలు ముంపు బారిన పడ్డాయన్నారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందించామని గుర్తు చేసారు. ఎకరానికి రూ 10 వేలు చొప్పున మొత్తంగా 7 లక్షల రూపాయలు ప్రభుత్వం రైతుల ఖాతాలకు జమ చేసిందన్నారు.

మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): దీపావళి పండుగ సందర్భంగా ఏలూరు పట్టణంలో ప్రమాదంలో చనిపోయిన మృతుడు దుర్గేసి సుధాకర్ కుటుంబానికి రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఇంకా ప్రమాదానికి గురైన క్షతగాత్రులకు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని సీపీఎం ఏలూరు నగర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో క్షతగాత్రులను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు పట్టణంలో దీపావళి పండుగ సందర్భంగా ఎన్నడూ లేని విధంగా బాణసంచా పేలుడు ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందటం చాలా బాధాకరమన్నారు. మృతుడు తూర్పు వీధి మారుతి నగర్‌లో పేద కుటుంబానికి చెందిన వ్యక్తి అని అన్నారు. కాబట్టి ఆ కుటుంబానికి మున్సిపల్ కార్పొరేషన్ ప్రకటించిన పరిహారం ఏమాత్రం సరిపోదని తెలిపారు. మృతుడు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత తీసుకొని రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు వీవీఎన్ ప్రసాద్, బి.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తికి రిమాండ్

నిడమర్రు: చానమిల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రామకృష్ణను అరెస్టు చేసి శనివారం తాడేపల్లిగూడెం కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై వీర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం రాత్రి చానమిల్లిలో బెల్ట్ దుకాణం ఏర్పాటు చేసి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి 25 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని రామకృష్ణను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సమాధుల పండుగ


కవ్వగుంటలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


పెదలింగంపాడులో సమాధుల వద్ద ప్రార్థన చేస్తున్న విచారణ గురువులు షింటో

పెదవేగి : మరణించిన తమ కుటుంబ సభ్యులు పరలోకంలో సంతోషంగా ఉండాలని కోరుకుంటూ క్రైస్తవ భక్తులు సమాధుల తోటలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమాధుల పండగను పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లోని కథోలిక (రోమన్ కేథలిక్ మినిస్ట్రీస్) సంఘస్తుల కుటుంబాల్లో మరణించిన వారి సమాధుల వద్దకు వెళ్లి కొద్ది రోజులుగా చుట్టుపక్కల పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి, రంగులతో అలంకరించి శనివారం ప్రత్యేకంగా పూలతో అలంకరించి, విచారణ గురువుల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ఈ ప్రార్థనల్లో దూరప్రాంతాల నుంచి వచ్చిన బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సమాధుల తోటలో ప్రార్థనలు

భీమడోలు: చనిపోయిన తమ కుటుంబీకుల ఆత్మలకు శాంతి చేకూరగాలని కోరుతూ సమస్త పరిశుద్ధ ఆత్మల పండుగ (సమాధుల తోట) దినోత్సవాన్ని శనివారం క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, భోగాపురం, కొల్లేరు గ్రామాల్లోని క్రైస్తవులు ఈ పండుగను జరుపుకున్నారు. సమాధులను సుందరంగా అలంకరించి సాయంత్రం కొవ్వొత్తులను వెలిగించి ప్రార్థనలు చేశారు. భీమడోలు పంచాయతీ శివారు పెదలింగంపాడులోని ఆర్‌సీఎం విచారణ గురువులు షింటో, జార్జి, మెల్సన్ దివ్యపూజ నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్, సంఘం పెద్దలు ఓగిరాల సురేష్, కురమా విజయరాజు, జంగం తంబి, కొండ సుబ్బారావు, గోరింకల సంజీవరావు, పులిపాటి తంబి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ పునఃప్రతిష్ఠ ఉత్సవం

భీమడోలు: గుండుగొలనులోని బీసీ కాలనీలో వేంచేసియున్న కనకదుర్గ, గణపతి స్వామి వార్ల ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా శనివారం ఆలయంలో పండితులు శ్రీలంక శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో శిష్య బృందం ఎస్.సుధీరాచార్యులు, వి.సాగర్ శర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పంచామృత, ఫలరస, సహిత అష్టత్తర శత కలశాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ నీటితో నిండిన బిందెలను నెత్తిన పెట్టుకుని మహిళలు, చిన్నారులు వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం విగ్రహానికి జలాభిషేకం చేశారు. ఈ నెల 3వ తేదీ ఆదివారం ఆలయంలోని పాత విగ్రహం స్థానంలో కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా మరియ మాత పండుగ

దెందులూరు: నాగులదేవునిపాడు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఇంటి జేవియర్ ఆధ్వర్యంలో మరియమాత పండుగను ఘనంగా శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏలూరు పీఠం ప్రొక్యురేటర్ ఫాదర్ రాజు హాజరయ్యారు. ఫాదర్ జేవియర్, ఫాదర్ రాజు ప్రత్యేక దివ్య పూజాబలి అర్పించారు. అనంతరం ఫాదర్ రాజును ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.